సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 17 । ఆగస్టు । 2024



అయ్.. మనోడేనండి..


అయ్.. ఓయ్.. మాటలు గోదావరి జిల్లాల యాసే. గోదారోళ్ల వెటకారంతో కూడిన మాటలు, యాసలు ఇటీవల కాలంలో యూట్యూబ్, సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతున్నాయి. - 8లో



నరకం చూపాడని కొట్టి చంపారు!

ఎన్నో ఊసులు చెప్పాడు.. మరెన్నో ఆశలు కల్పించాడు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ యువతిని ఇంటి నుంచి తీసుకువెళ్లాడు.. తర్వాత నరకం చూపించాడు. - 8లో

1.96 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 1,96,143 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం 10 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 13,750 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

కూలీలకు బకాయి వేతనాలు జమ

సాక్షి ఇంపాక్ట్

ఆలమూరు: జిల్లాలోని 22 మండలాలకు చెందిన ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు జమ అవుతున్నాయి. మొత్తం 5.11 లక్షల ఉపాధి కూలీలకు గత నాలుగు నెలల నుంచి రూ.75.21 కోట్ల వేతనాలను ప్రభుత్వం అందించాలి. దీనిపై ఈ నెల 4న 'సాక్షి' దినపత్రికలో ఆ'కూలీ' కేకలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ నెల పది వరకూ బకాయి పడిన వేతనాలను ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఈ విషయాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ పి.మధుసూదన్, ఆలమూరు ఏపీఓ జి.అరుణకుమారి తెలిపారు. ఉపాధి కూలీలకు ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సంబంధిత ఏపీఓ కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: రెండు రోజుల పాటు జరిగే పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం ప్రారంభం కానున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి అనుగుణంగా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సమావేశాల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 22 మండలాల్లో 47 ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ కాంప్లెక్స్‌ల పరిధిలోని 50 శాతం ఉపాధ్యాయులు శనివారం జరిగే కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కానుండగా, మిగిలిన 50 శాతం మందికి నిర్దేశించిన కాంప్లెక్స్‌లో సోమవారం హాజరు కానున్నారు. అలాగే తెలుగు, గణితం, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శనివారం సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశాలు జరగనుండగా, సోమవారం ఇంగ్లిషు, ఫిజికల్ సైన్స్, హిందీ, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు సబ్జెక్టు సమావేశాలు నిర్వహించనున్నారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలను శనివారం నియోజకవర్గ స్థాయిలో జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో 123 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, వాటి పరిధిలో 5,442 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కానున్నారు. అలాగే 5,200 మంది వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. ఇదిలా ఉంటే కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలకు సంబంధించిన ఉర్దూ టీచర్లకు ఈ నెల 20న రాజమహేంద్రవరంలోని మకా ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీ సెట్–24 మూడవ దశ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. గత జూన్ 30వ తేదీన మొదటి దశ ,జూలై నెలలో రెండవ దశకు నోటిఫికేషన్ విడుదల చేసి సీట్లు భర్తీ చేయగా తాజాగా మూడవ దశకు షెడ్యూల్ విడుదల చేశారు.

- ఆగస్టు 19వ తేది నుంచి 21వ తేది వరకూ ఆన్‌లైన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- ఆగస్టు 22 వ తేది వరకూ ఆన్‌లైన్ సర్టిఫికెట్ల పరిశీలన
- ఆగస్టు 20 నుంచి 22 వరకూ వెబ్ ఆప్షన్లు. 23వ తేదీన వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం.
- ఆగస్టు 26న సీట్ల కేటాయింపు. 26వ తేదీ నుంచి 30వరకూ కళాశాలలో చేరికకు చివరితేది.
- ఉమ్మడి జిల్లాలో హెల్ప్‌లైన్ కేంద్రం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల (జగన్నాథపురం)

కోల్‌కతా ఘటనపై నేడు ఐఎంఏ నిరసన

అమలాపురం టౌన్: కోల్‌కతాలో ఓ జూనియర్ మహిళా డాక్టర్‌పై ఆటవికంగా అత్యాచారం చేసి, ఆ తర్వాత అతి కిరాతకంగా హతమార్చిన ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా శాఖ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. డాక్టర్లపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై జిల్లా ఐఎంఏ ఆధ్వర్యంలో అమలాపురంలో శనివారం ఉదయం నిరసన చేపట్టేందుకు నిర్ణయించినట్టు సంఘ జిల్లా కార్యదర్శి డాక్టర్ కడలి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం కోనసీమలోని వైద్యులంతా అమలాపురం గడియారం స్తంభం సెంటరుకు చేరుకుని, అక్కడ నిరసన వ్యక్తం చేస్తారని చెప్పారు. అక్కడ నుంచి వైద్యులు ప్రదర్శనగా స్థానిక కలెక్టరేట్‌కు చేరుకుని, కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్టు వివరించారు. శనివారం ఉదయం 9 గంటల కల్లా ఐఎంఏ వైద్యులంతా గడియారం స్తంభం సెంటరుకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు రీచ్ కాక..



అయినవిల్లి మండలం వీరవల్లిపాలెంలో ఇసుక తవ్వకాలు (ఫైల్)

- సీఆర్‌జెడ్‌తో అవాంతరాలు
- జిల్లాలో 24 రీచ్‌ల గుర్తింపు
- 12 చోట్ల మాత్రమే తవ్వకాలు
- నిబంధనలు సడలించాలంటున్న అధికారులు

సాక్షి, అమలాపురం/ రావులపాలెం: ఇసుక ర్యాంపులకు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అడ్డుగా మారింది. ఫలితంగా ర్యాంపుల ఏర్పాటుకు ప్రతిబంధకమైంది. జిల్లాలో సముద్ర తీర ప్రాంతాలు, మత్స్యకారులు వేట సాగించే గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను సీఆర్‌జెడ్ పరిధిలోకి తీసుకు వచ్చారు. 2011లో సీఆర్‌జెడ్‌ను అమలులోకి తెచ్చారు. దీనివల్ల జిల్లాలోని కీలక ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. సీఆర్‌జెడ్ నిబంధనలు సడలించకుంటే పూర్తిస్థాయిలో ర్యాంపులు అందుబాటులోకి రావని మైనింగ్, పర్యావరణ శాఖ అధికారులు తేల్చి చెబుతున్నారు.

సీఆర్‌జెడ్ పరిధిలో సముద్రతీర ప్రాంతం ఉంది. ఆయా చోట్ల ఎటువంటి తవ్వకాలు చేయకూడదు. కానీ ఇక్కడే ఇసుక తవ్వకాలు చేయడంతోపాటు ఆక్వా చెరువుల తవ్వకాలు చేస్తున్న విషయం తెలిసిందే. సీఆర్‌జెడ్ పరిధిని గోదావరి పరివాహక ప్రాంతాలకు సైతం విస్తరించారు. నేషనల్ సెంటర్ ఫర్ సస్టనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం) ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లాలో 16 మండలాల పరిధిలోని 128 గ్రామాలు సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నాయి. సఖినేటిపల్లి మండలం (ఎనిమిది గ్రామాలు), మలికిపురం (తొమ్మిది), మామిడికుదురు (పన్నెండు), రాజోలు (పన్నెండు), అల్లవరం (పదకొండు), ఉప్పలగుప్తం (పది), అమలాపురం (రెండు), అంబాజీపేట (రెండు), కాట్రేనికోన (పదకొండు), కపిలేశ్వరపురం (రెండు), కొత్తపేట (రెండు), పి.గన్నవరం (పదిహేడు), రావులపాలెం (నాలుగు), అయినవిల్లి (ఆరు), కె.గంగవరం (ఎనిమిది), ముమ్మిడివరం (పన్నెండు) గ్రామాలు సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నాయి. దీనిపై గత నెల 31న అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సీఆర్‌జెడ్‌లో 300 చదరపు మీటర్ల వరకూ మత్స్యకారులు నిర్మాణాలు చేసుకోవచ్చు. స్థానికంగా అనుమతులు తీసుకోవచ్చని నిర్ణయించారు. అలాగే క్రీక్స్‌లో వాటర్ లెవిల్ విడ్త్ నుంచి 100 మీటర్ల వరకూ బఫర్‌ను 50 మీటర్లు చేశారు. భవన నిర్మాణాలకు సంబంధించిన విషయం పక్కన పెడితే సీఆర్‌జెడ్ పరిధి వల్ల జిల్లాలోని గోదావరిలో పలు ర్యాంపుల వద్ద ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.



వీరవల్లిపాలెంలో ర్యాంపు నుంచి లారీ ద్వారా ఇసుక తరలింపు (ఫైల్)

అవకాశం ఉన్నా..

జిల్లాలో 12 వరకూ ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్న ర్యాంపులు ఉన్నాయి. వీటి నుంచి తవ్వకాలు సాగిస్తున్నారు. అయితే వాస్తవంగా 24 ప్రాంతాల నుంచి ఇసుక తవ్వకాలు చేసే అవకాశముంది. ఇలా **చేస్తే ఉచిత ఇసుక పాలసీ అమలులో ఉన్నా స్థానిక సంస్థలకు సీనరేజ్ రూపంలో, ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో ఆదాయం రావడంతోపాటు ఇసుక లభ్యత అధికంగా ఉంటోంది. భవన నిర్మాణ రంగం సైతం వేగంగా వృద్ధి చెందుతోంది. కానీ సీఆర్‌జెడ్ నిబంధనలతో పలు ర్యాంపుల నుంచి ఇసుక తీసే అవకాశం లేకుండా పోయింది.** ఉదాహరణకు కపిలేశ్వరపురం మండల పరిధిలో కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నాయి. ఇక్కడే ప్రస్తుతం స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుక అమ్మకాలు జరుగుతుండడం విశేషం. రావులపాలెం మండలం గోపాలపురం, రావులపాలెం, అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, కె.గంగవరం మండలం కోటిపల్లి, కూళ్ల, సఖినేటిపల్లి, రాజోలు మండలం సోంపల్లి, పి.గన్నవరం మండలం ముంజవరం, లంకల గన్నవరం, మానేపల్లి, పాత గన్నవరం ప్రాంతంలో గతంలో ఇసుక తవ్వకాలు జరిగేవి. వీటిలో ఇసుక ర్యాంపులు అధికం.

పరిధి నుంచి తొలగించాలి

ఇసుక తవ్వకాలకు వీలుగా గతంలో ర్యాంపులు నిర్వహించిన గ్రామాలను సీఆర్‌జెడ్ పరిధి నుంచి తొలగించాలనే డిమాండ్ పెరుగుతోంది. గనులు, భుగర్భ శాఖ అధికారులు ప్రభుత్వానికి పలు దఫాలు ప్రతిపాదనలు పంపించారు. దీనికి ఎన్విరాల్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు దృష్టికి ఈ విషయాన్ని జిల్లా అధికారులు తీసుకు వెళ్లారు. దీనిపై తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడతానని ఆయన చెప్పుకొచ్చారు. సీఆర్‌జెడ్‌ను సవరిస్తే కాని ఇక్కడ ఇసుక తవ్వకాలు చేసే అవకాశం లేదు.



అమలాపురంలో పునాదుల వరకూ పూర్తయిన అన్న క్యాంటీన్ నిర్మాణం

ఆరగించేందుకు అన్నలా..

- అన్న క్యాంటీన్ల ముసుగులో దోపిడీ
- మరమ్మతుల పేరిట మింగేసి..

సాక్షి, అమలాపురం: ఆరగించేందుకు కొత్త పథకం తెచ్చారు.. పేదలకు బువ్వ అంటూ రూ.లక్షలు బొక్కేసేందుకు తెరలేపారు.. కూటమి ప్రభుత్వంలో మొదలైన అన్న క్యాంటీన్లు ఇంత పేదల కడుపు నింపకున్నా, టీడీపీ ఆస్థాన కాంట్రాక్టర్ల జేబులు మాత్రం నింపుతున్నాయి. గతంలో ఉన్న అన్న క్యాంటీన్ భవనాలకు చేపట్టిన చిన్న చిన్న మరమ్మతులకు రూ.లక్షలకు లక్షలు కేటాయించుకున్నారు. ఇక కొత్తగా నిర్మిస్తున్న భవనానికి సైతం కేటాయించిన నిధులు చూసి సామాన్యులను ముక్కున వేలేసుకుంటున్నారు.

జిల్లాలో అమలాపురం గ్రేడ్–1 మున్సిపాలిటీతో పాటు మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధుల్లో సుమారు లక్ష మందికి పైగా జనాభా ఉంటారని అంచనా. 2014–19 టీడీపీ పాలనలో రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్లను నిర్వహించేవారు. అమలాపురంలో ఏర్పాటు చేయలేదు. అప్పట్లో ఎంపిక చేసిన స్థలం కోర్టు వివాదంలో ఉండడం వల్ల ఇక్కడ నిర్వహించలేదు. ఇప్పుడు రామచంద్రపురం, మండపేటల్లో మరమ్మతులు చేపట్టి శుక్రవారం ప్రారంభించారు. అమలాపురం మున్సిపాలిటీలో కొత్త భవన నిర్మాణం చేపట్టారు. మండపేట మున్సిపాలిటీ పరిధిలో మరమ్మతులకు ఏకంగా రూ.13.85 లక్షలు ఖర్చు చేశారు. భవనంలో



మండపేటలో అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు

లోపల, వెలుపుల చిన్న చిన్న పనులు చేయడంతో పాటు కొత్త హంగులు చేశారు. కాంపౌండ్ వాల్ చుట్టూ దెబ్బతిన్న ఫ్లోరింగ్ చేయడంతో పాటు ఫ్రంట్ ఎలివేషన్ చేశారు. అయితే వీటికి ఇంత ఖర్చు చేయాల్సిన అవసరం లేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే రామచంద్రపురం మున్సిపాలిటీలో గతంలో ఉన్న అన్న క్యాంటీన్‌కు రూ.9.71 లక్షలతో మరమ్మతులు నిర్వహించారు. ఇంత ఖర్చు పెట్టి చేసే మరమ్మతులు ఏమున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భవనానికి ఎల్లో బోర్డులు, గ్లాసులు వేయడంతో పాటు ఫ్లోరింగ్ చేశారు.

ఎందుకంత ఖర్చో!

అమలాపురం మున్సిపాలిటీలో అన్న క్యాంటీన్‌కు కొత్త భవన నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోనే దీని నిర్మాణం జరుగుతోంది. ఇందుకు రూ.45 లక్షలు వెచ్చిస్తున్నారు. వాస్తవంగా దీని నిర్మాణానికి ఇంత ఖర్చు కాదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ భవనం పునాదుల దశలో ఉంది.

చమురు సంస్థలకు చెంపపెట్టు

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

అమలాపురం టౌన్: మైనింగ్ చేసే సంస్థలు విధిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు రాయల్టీ చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నాయకత్వంలో న్యాయమూర్తులు ఈ తీర్పు చెప్పడం రాష్ట్రంలో ఖనిజ సంపద కార్యకలాపాలు, అన్వేషణల పేరుతో దోచుకుంటున్న చమురు సంస్థలకు చెంప పెట్టులాంటిదన్నారు. శుక్రవారం అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి కేజీ బేసిన్ పరిధిలో చమురు సంస్థలు భూమిని తవ్వి, గుల్లచేసి అన్వేషణలు, కార్యకలాపాల పేరుతో రూ.కోట్లు దోచుకుంటున్నాయని గుర్తు చేశారు. మొత్తంగా కేజీ బేసిన్ ప్రాంతానికి దాదాపు రూ.50 లక్షల కోట్ల రాయల్టీ రావాల్సి ఉందన్నారు. చమురు సంస్థలు సోషల్ రెస్పాన్సిబులిటీ పేరుతో చిన్న సామాజిక భవనాలు నిర్మించడం, అక్కడక్కడ రోడ్లు వేయడం తప్ప భారీ మొత్తంలో రాయల్టీ రూపంలో ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించిన సందర్భాలు లేవన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చమురు సంస్థల నుంచి రాయల్టీని పూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

స్థాయిలో రాబడితే రాష్ట్రానికి ఉన్న కొన్ని ఆర్థిక సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన అన్నారు. కొన్నేళ్లుగా చమురు సంస్థలు ఇక్కడ భూములను ఇష్టానుసారం తవ్వేసి చమురు, సహజ వాయువులను వెలికి తీస్తూ వ్యవసాయాన్ని విచ్ఛిన్నం చేస్తున్న పరిణామాలపై తాము ఉద్యమాలు చేస్తున్నామని గుర్తు చేశారు. మైనింగ్ చేసే సంస్థల నుంచి రాయల్టీ నిధులను రాబట్టినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాకారమవుతుందని పేర్కొన్నారు. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్ట్, విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర మేజర్ పనులకు రాయల్టీ సొమ్ము ద్వారా నిధులు సమకూర్చుకునే పరిస్థితి ఉంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో మిత్రత్వంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ దిశగా రాయల్టీ నిధులను కేంద్రం మెడలను వంచి సాధించాలన్నారు.

53 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు

దేవరపల్లి: వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మార్కెట్‌లో లభిస్తోన్న ధర రైతులకు లాభసాటిగా ఉండడంతో రైతులు పొగాకు విక్రయాలు వేగంగా జరుపుతున్నారు. 2023–24 పంట కాలంలో పండించిన పొగాకును ఈ ఏడాది మార్చి 6న కొనుగోలు చేయడం ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లాలోని రెండు వేలం కేంద్రాలతో పాటు ఏలూరు జిల్లాలోని మూడు వేలం కేంద్రాలు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో ఉన్నాయి. ఇప్పటి వరకూ 127 రోజులు కొనుగోళ్లు నిర్వహించారు. శుక్రవారం నాటికి ఐదు వేలం కేంద్రాల్లో సుమారు రూ.1,749 కోట్ల విలువ గల 53 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. 2023–24 ఏడాదికి బోర్డు 48.25 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా సాగు విస్తీర్ణం పెరగడంతో ఉత్పత్తి బాగా పెరిగింది. దీంతో 67 మిలియన్ల కిలోలు పొగాకు ఉత్పత్తి అవుతుందని పొగాకు బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థలు అంచనా వేశాయి. దాదాపు ఈ అంచనాలకు చేరువలో పొగాకు ఉత్పత్తి అవుతోంది. ఇప్పటి వరకూ 53 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరగడంతో బ్రైట్ గ్రేడు పొగాకు అమ్మకాలు దాదాపు చివరి దశకు చేరుకున్నట్టేనని అధికారులు వివరిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: సీబీఎస్ఈ సిలబస్ అనుబంధ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సీబీఎస్‌సీ సిలబస్ అనుబంధ పాఠశాలల్లోని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలోని 55 బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో ఎంతమంది పిల్లలు ఉన్నారని, వారికి అందిస్తున్న భోజనం, కాస్మోటిక్ చార్జీలు, మెడికల్ క్యాంపుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను ఆరా తీశారు. సోషల్ వెల్ఫేర్ జేడీ జ్యోతిలక్ష్మీదేవి, డీఈఓ ఎం.కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిగా మంచానికి, వీల్ చైర్‌కు పరిమితమైనట్లు వికలాంగ సర్టిఫికెట్లు పొంది అధిక మొత్తంలో పెన్షన్లు పొందుతున్న పింఛనుదారులను పునః పరిశీలించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్లపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తి అంగవైకల్యం కలిగి మంచానికి, కుర్చీలకే పరిమితమైనట్లు సదరం సర్టిఫికెట్లు పొంది, లేక ఎటువంటి సర్టిఫికెట్ లేకుండా రూ.15 వేల పింఛన్ అందుకుంటున్న వ్యక్తులు 668 మంది ఉన్నారన్నారు. ఇందులో కొంతమంది అతి తక్కువ అంగవైకల్యం కలిగి ఉన్నప్పటికీ పూర్తి అంగవైకల్యం కేటగిరీలో రూ.15 వేల పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై జిల్లాలో 5 రీఅసెస్మెంట్ మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేసి పునః పరిశీలించాలన్నారు. ఈ టీమ్‌లో ఆర్థోపెడీషియన్, ఫిజీషియన్, మెడికల్ ఆఫీసర్ ఉంటారన్నారు. ఈ ప్రక్రియ నెలాఖరు లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర, డీఆర్డీఏ పీడీ శివశంకర ప్రసాద్, డీసీహెచ్ ఎస్.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రత్నగిరి కిటకిట

తొండంగి: శ్రావణమాసంలో వివాహ ముహూర్తాల నేపథ్యంలో శుక్రవారం రత్నగిరి నూతన దంపతులతో కిటకిటలాడింది. గురువారం రాత్రి వివాహాలు జరగడంతో రాష్ట్రం నలుమూలల నుంచి నూతన దంపతులు సత్యదేవుని వ్రతాలు ఆచరించేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. అదే విధంగా రత్నగిరి, సత్యగిరి కొండలపై కూడా వివాహాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వ్రతమంటపాలన్నీ నూతన వధూవరులతోపాటు భక్తులతో రద్దీగా మారాయి. సత్యదేవుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. దేవస్థానం అధికారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా మంచినీరు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేశారు. కాగా శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం పండగ సందర్భంగా రత్నగిరి కొండపై వనదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, కొండ దిగువ దుర్గామాత ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ. రెండు వేల వ్రత మంటపాల్లో ఏసీలు పనిచేయక భక్తులకు ఇబ్బందులు

రత్నగిరి కొండపైకి సత్యదేవుని వ్రతమాచరించే భక్తులకు రెండు వేలు రూపాయల వ్రత మంటపాల్లో ఏసీలు రెండు రోజులుగా సక్రమంగా పనిచేయక భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొండపైన రూ.1,500, రూ.వెయ్యి తదితర కేటగిరిల్లో మంటపాలు కేటాయించి భక్తులకు వ్రతాలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం కొండపై స్వామి వారి ప్రధానాలయం ఎదురుగా ఏసీ మంటపాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఏసీ పనిచేయకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయంగా విడిగా ఏసీలు ఏర్పాటు చేశారు. అవి రెండు రోజులుగా సక్రమంగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని భక్తులు వాపోయారు. దేవస్థానం అధికారులు వ్రత మంటపాల్లో పూర్తిస్థాయిలో ఏసీ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్రతం నిర్వహించే సమయంలో కేవలం దంపతులకు మాత్రమే కూర్చునే అవకాశం ఇస్తున్నారని, కుటుంబ సమేతంగా దంపతులతోపాటు తమ సంతానాన్ని కూడా వ్రతంలో పాల్గొనేందుకు వ్రత మంటపాల్లో కూర్చునే వెసులుబాటు కల్పించాలని హైదరాబాద్‌కు చెందిన భక్తుడు విఠల్ కోరారు. పిల్లలకు కూడా పూజా విధానం, సత్యదేవుని వ్రత విధానం, ఆచార వ్యవహారాలపై అవగాహన, మరింత ఆసక్తి కలుగుతుందన్నారు.



అన్నవరం కొండపై సత్యదేవుని వ్రతం ఆచరిస్తున్న నూతన దంపతులు, భక్తులు

మహాలక్ష్మీ నమో నమః

- వెదురుపాక పీఠంలో వార్షికోత్సవాలు ప్రారంభం
- నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

రాయవరం: శ్రీమహాలక్ష్మీ నమో నమః అంటూ ఆ అమ్మవారిని కొలిచారు.. ప్రత్యేక పూజలు చేశారు. దీనికి రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠం వేదిక అయ్యింది. పీఠం 52వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. 1972లో పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) పీఠం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఏటా పీఠం వార్షికోత్సవాలను ఆగస్టు 16న ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధన చేశారు. కొల్హాపూర్ వేద పండితులచే శ్రీమహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజనం అర్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు తమిళనాడు తిరుత్తణి ఆలయ అర్చకులచే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) మాట్లాడుతూ లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కళ్యాణోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. పీఠంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠం ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. అన్నవరం దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ ఐవీ రోహిత్, ఇన్‌చార్జి ఈఓ డి.రమేష్‌బాబులు విజయదుర్గా పీఠాన్ని సందర్శించి, గాడ్ ఆశీస్సులు అందుకున్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు భాస్కరనారాయణ, జి.సత్య వెంకటకామేశ్వరి, పి.సత్యకనకదుర్గ, బి.రమ, పీఠం పీఆర్వో వి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజన అర్చన నిర్వహిస్తున్న వేద పండితులు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



గుమ్మిలేరులో వీర్రాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి వ్యవసాయ కూలీ మచ్చారి వీర్రాజు (45) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం.. గుమ్మిలేరుకు చెందిన వీర్రాజు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పశువులకు పచ్చగడ్డి కోసుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. అక్కడి చెరువుగట్టు వద్దకు వచ్చేసరికి అక్కడ పడిఉన్న హెచ్‌టీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై అశోక్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వీర్రాజు కుటుంబానికి పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



గల్లంతైన నరేంద్ర (ఫైల్)

కె.గంగవరం: మండలంలోని గౌతమీ గోదావరిలో స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, కె.గంగవరం పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రపురం మండలం తోటపేటకు చెందిన కందుల నరేంద్ర తన స్నేహితుడు కంచుమర్తి అంజితో కలసి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కోటిపల్లి రేవులోని పుష్కర ఘాట్ వద్ద స్నానానికి దిగారు. ఇటీవల గోదావరికి వరద రావడం, ప్రస్తుతం నదీ వడి ఎక్కువగా ఉండటంతో నీటి అడుగున బురదమయంగా మారింది. దీంతో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు గోదావరి ఉధృతికి మునిగిపోయారు. ఇందులో కంచుమర్తి అంజి సురక్షితంగా బయటపడ్డాడు. నరేంద్ర ఆచూకీ మాత్రం తెలియ రాలేదు. స్థానికుల సమాచారంతో కె.గంగవరం ఏఎస్సై కేవీఎస్ రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని పిండ ప్రదానాల రేవుకు సమీపంలో ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న ఆ వృద్ధుడిని చూసి స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడి నుంచి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదు. ఈ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఆయ్.. మనోడేనండి



- దర్శకుడు అంజిబాబు అమలాపురం కుర్రోడే
- కోనసీమలోనే నూరు శాతం సినిమా చిత్రీకరణ
- ఫిలిం అసోసియేషన్ నటీనటులకు అవకాశం



ఆయ్ చిత్రం పోస్టర్

అమలాపురం టౌన్: ఆయ్.. ఓయ్.. మాటలు గోదావరి జిల్లాల యాసే. గోదారోళ్ల వెటకారంతో కూడిన మాటలు, యాసలు ఇటీవల కాలంలో యూట్యూబ్, సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అవే సినిమాల్లోనూ సక్సెస్ అవుతున్నాయి. ఈ కోవలోంచే రెండు రోజుల కిందట విడుదలైన 'ఆయ్' సినిమా పుట్టుకొచ్చింది. దీనిని గోదారోళ్ల యాసను రంగరించి చిత్రీకరించారు. అమలాపురం కుర్రాడైన యువ దర్శకుడు అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే నూరు శాతం కోనసీమ గ్రామీణంలో సినిమా తీసి విజయవంతం అయ్యారు. ఇటీవల విడుదలైన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, కమిటీ కుర్రాళ్లు చిత్రాలు కూడా దాదాపు కోనసీమ అందాల నడుమే రూపుదిద్దుకున్నాయి. ఈ చిత్రాల్లో కోనసీమ ఫిలిం అసోసియేషన్‌కు చెందిన వర్ధమాన నటీనటులు 50 మందికి పైగా ఆయా చిత్రాల దర్శకులు అవకాశాలు ఇచ్చారంటే ఈ పచ్చని సీమకు సినిమా సిరి పెరుగుతోందని తెలుస్తోంది. ఆయ్ చిత్రంలో కోనసీమ ఫిలిం అసోసియేషన్‌కు చెందిన 12 మంది నటీనటులకు ఛాన్స్ దొరికింది.

అంజిబాబు ప్రస్థానం ఇది

అమలాపురం కొంకాపల్లికి చెందిన వర్ధమాన సినీ దర్శకుడు అంజిబాబు కంచిపల్లి ఎస్‌కేబీఆర్ కాలేజీలో చదివారు. ఆయనది వ్యవసాయ కుటుంబం. చిన్నతనం నుంచీ ఆయన సినీ పరిశ్రమపై మక్కువ పెంచుకున్నారు. 12 ఏళ్ల కిందటే మంచి సందేశాత్మక చిత్రాలు తియ్యాలన్న ఆకాంక్షతో సినీ పరిశ్రమలోని దర్శక విభాగంలో శిక్షణ పొందారు. అసోసియేట్, కోఅసిస్టెంట్ డైరెక్టర్‌గా పలువురి దర్శకుల వద్ద పనిచేశారు. నేడు తాను కన్న సినీ కలను నెరవేర్చుకునేలా ఆయ్ చిత్రాన్ని రూపొందించారు. తాను పుట్టి పెరిగిన అమలాపురం పరిసర ప్రాంతాల్లోనే ఆ సినిమాను తీసి కోనసీమ కుర్రాడు అనిపించుకున్నారు. దర్శకుడిగా తొలిసారిగా ఆయ్ చిత్రానికి బాధ్యత వహించి కోనసీమ నేటివిటీని, ఆ సీమతో మిళితమయ్యే కథాంశాన్ని తెరకెక్కించారు. అమలాపురం పట్టణంతోపాటు కోనసీమలోని దాదాపు 22 గ్రామాల్లోని నదీ పాయలు, కొబ్బరి, అరటి తోటలు, వరి చేలు, కాలువ గట్లు, సముద్ర తీరాన్ని తన సినిమాలో బంధించారు. చిన్నతనంలో స్నేహాలుగా చిగురించి పెద్దయ్యాక కులాల కుంపటితో రగలిపోయే నేటి తరాన్ని కులాలు కంటే స్నేహాలు గొప్పవన్న సందేశంతో సినిమాను ఆద్యంతం రక్తికట్టించారు. అందుకే 'ఆయ్' మెయిన్ టైటిల్‌తోనూ, 'మేం ఫ్రెండ్స్‌ండి' అనే సబ్ టైటిల్ (ట్యాగ్)తో చిత్రాన్ని రూపొందించారు. మధ్యలో హాస్యం జోడించి పూర్తి ఇంటర్‌టైన్‌మెంట్ సినిమాను తన మొదటి బహుమతిగా ప్రేక్షకులకు అందించారు. కమిటీ కుర్రాళ్లు సినిమా ఇక్కడి నేటివిటీతో చిత్రీకరించి హిట్ కొడితే.. ఆయ్ చిత్రం కూడా కోనసీమ యాసను, స్నేహ బంధాలను గుర్తు చేస్తూ సాగింది. అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, కమిటీ కుర్రాళ్లు చిత్రాల దర్శకులు కోనసీమే తురులై ఈ రెండు చిత్రాలను ఈ ప్రాంత నేటివిటీతో చిత్రీకరించారు. అయితే ఆయ్ చిత్ర దర్శకుడు అంజిబాబు అమలాపురానికి చెందిన వాడై.. ఈ ప్రాంతానికి అనువైన, అనుబంధమైన కథాంశాన్ని ఎంచుకుని కష్టపడి, ఇష్టపడి తీశారు.

ఇక్కడి నుంచే నా తొలి చిత్రం

"నేను సినీ దర్శకునిగా తొలి చిత్రం 'ఆయ్' కోనసీమ నుంచే శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది. 12 ఏళ్ల నా కల సాకారమైంది. స్నేహ సంబంధాలు కులాల రాపిడిలో పడి చెక్కు చెదరకూడదన్న సందేశంతో ఈ చిత్రం తీశాను. కేరళను మించిన ప్రకృతి సహజ సిద్ధ అందాలు కోనసీమలోనే ఉన్నాయి. నా చిన్నతనం నుంచి చూస్తున్న కోనసీమ ప్రకృతి అందాలతో పాటు అచ్చమైన గ్రామీణ సౌందర్యాన్ని చిత్రంతో తెరకెక్కించాను. హాస్యం, సెంటిమెంట్ తదితర అంశాలతో మంచి చిత్రాన్ని తీశానన్న సంతృప్తి మిగిలింది."

– అంజిబాబు కంచిపల్లి, ఆయ్ చిత్ర దర్శకుడు, అమలాపురం





తాను చిత్రీకరించిన సన్నివేశాన్ని చూస్తున్న దర్శకుడు అంజిబాబు, ఆయ్ చిత్రంలోని ఓ సన్నివేశం

వాడపల్లి వాసా.. చిద్విలాసా



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

- ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు
- మార్మోగిన స్వామివారి దివ్యక్షేత్రం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం: నమో వేంకటేశా.. శ్రీ శ్రీనివాసా అంటూ ఆ స్వామిని భక్తజనం కొలిచింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు మూడో రోజు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ జీఎం హరీష్‌తో పాటు ఆకుల రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం స్వామివారికి సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, హోమాలు, మహా పూర్ణాహుతి, స్వామివారికి విశేష ఆరాధన, మహదాశీర్వాచనం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నరకం చూపాడని కొట్టి చంపారు!

- ప్రేమించి హింసించాడని కక్ష
- చెల్లెలి బాధ చూడలేక స్నేహితుడితో కలసి యువకుడిని హత్య చేసిన సోదరుడు
- పోలీసుల అదుపులో నిందితులు



హత్య ఘటన వివరాలు తెలుపుతున్న సీఐ గోవిందరాజు, ఎస్సై సురేష్



మృతుడు నోయల్ జార్జి (ఫైల్)

మలికిపురం: ఎన్నో ఊసులు చెప్పాడు.. మరెన్నో ఆశలు కల్పించాడు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ యువతిని ఇంటి నుంచి తీసుకువెళ్లాడు.. తర్వాత నరకం చూపించాడు. గంజాయికి బానిసైన ఆ యువకుడు తన ప్రియురాలిని కూడా గంజాయి తాగమని బలవంతం చేసేవాడు. ఆ మత్తులో యువతిని శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధించాడు. చివరికి ఆ బాధ భరించలేని ఆ యువతి ఆ యువకుడి చెర నుంచి తప్పించుకుని తన అన్న వద్దకు చేరుకుంది. జరిగిన విషయం చెప్పి విలపించింది. అక్కున చేర్చుకున్న యువతి సోదరుడు పథకం వేశాడు. నమ్మించి మోసం చేసిన ఆ యువకుడిని యువతి, సోదరుడు, అతని స్నేహితుడు కలసి హత్య చేశారు. ఈ సంఘటనకు సంబంధించి రాజోలులో సీఐ గోవిందరాజు వివరాలు వెల్లడించారు. ఆ ఆసక్తికర విషయాలు ఇలా.. మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామానికి చెందిన రాపాక ప్రశాంతి, మలికిపురానికి చెందిన పడమటి నోయల్ జార్జి (19) ప్రేమించుకున్నారు. ఆరు నెలలు కాకినాడలో సహజీవనం చేశారు. నోయల్ మద్యం, సిగరెట్లు తాగుతూ, గంజాయికి బానిస అయ్యాడు. తనతోపాటు ప్రశాంతిని కూడా తాగమని ఇబ్బంది పెట్టి శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. దీనిని తట్టుకోలేక ప్రశాంతి ఈ నెల 9న కాకినాడ నుంచి గుడిమెళ్లంకలో తన అన్నయ్య రాపాక ప్రకాష్ వద్దకు వచ్చేసింది. అక్కడ నోయల్ జార్జి బాధపెట్టిన విషయాలు చెప్పి విలపించింది.

పథకం రచించి..

తన చెల్లెలిని బాధ పెట్టిన నోయల్ జార్జిపై కక్ష తీర్చుకోవాలని రాపాక ప్రకాష్ పథకం రచించాడు. అతని స్నేహితుడైన రాజోలు గ్రామస్తుడు యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్, చెల్లి రాపాక ప్రశాంతితో కలిసి నోయల్ జార్జిని చంపేయాలని ప్లాన్ చేశాడు. 9న రాత్రి రాపాక ప్రశాంతి సెల్ నుంచి నోయల్ జార్జికి ఫోన్ చేయించి దిండి– చించినాడ బ్రిడ్జి వద్దకు రావాలని చెప్పించాడు. అక్కడి రాగానే ఇనుప రాడ్లతో నోయల్ జార్జిని కొట్టి చంపి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి పడేశారు. నోయల్ జార్జి తీసుకువచ్చిన మోటార్ సైకిల్‌ను బ్రిడ్జి వద్ద పెట్టి అక్కడ నుంచి నోయల్ జార్జి అదృశ్యమైనట్లు సృష్టించి పారిపోయారు. రెండు రోజుల తర్వాత నోయల్ జార్జి తండ్రి పడమటి రత్నంరాజు తన కుమారుడి ఆచూకీ కోసం ఫిర్యాదు చేయగా మలికిపురం ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 12న నోయల్ జార్జి మృతదేహం అంతర్వేది పల్లిపాలెం అన్నాచెల్లెలు గట్టు సమీపంలో గోదావరి ఒడ్డున ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాపాక ప్రకాష్, రాపాక ప్రశాంతి, యర్రంశెట్టి ప్రేమ్ కుమార్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ గోవిందరాజు వివరించారు.

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై వృద్ధుడి మృతి



ప్లాట్‌ఫామ్‌పై మృతి చెందిన వృద్ధుడు

తుని: స్థానిక రైల్వే స్టేషన్లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. ఆ వివరాల్లోకెళితే.. సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి తుని రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మృతి చెంది ఉన్నాడు. ఇతని మృతికి కారణాలు తెలియలేదు. మృతుడు నలుపు, సిమెంట్ రంగు ఫుల్ చేతుల చొక్కా, నలుపు షార్ట్ ధరించి ఉన్నాడు. ఇతని ఎడమ కాలికి యాక్సిడెంట్ అయినట్లు ఉంది. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. సంబంధికులు ఉంటే 94948 87786 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

నాణ్యమైన భోజనం సరఫరాకు చర్యలు



పొడగట్లపల్లిలో అన్న క్షేత్రను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్ తదితరులు

రావులపాలెం: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలకు నాణ్యమైన భోజనాన్ని పొడగట్లపల్లి అన్న క్షేత్ర నుంచి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో హరే కృష్ణ ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్షేత్రను ఆయన సందర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు అన్న క్యాంటీన్లకు రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని హరే కృష్ణ ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్షేత్ర నుంచి ఆహారం సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి సరఫరా చేసే ఆహారం, ముడి సరకుల నాణ్యత, వంట గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో పునః ప్రారంభమైన అన్న క్యాంటీన్లకు పొడగట్లపల్లి అన్న క్షేత్రం నుంచే ఆహారం సరఫరా అవుతుందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఈ అన్న క్షేత్ర నుంచి ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆహారాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. రోజుకు 30 వేల మందికి ఆహారం సరఫరా చేయగల సామర్థ్యం ఉన్న కిచెన్ అందుబాటులో ఉందని కలెక్టర్‌కు నిర్వాహకులు తెలిపారు. త్వరలోనే కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని పొడగట్లపల్లి అన్న క్షేత్ర నుంచి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హరే కృష్ణ ఉద్యమం జోన్ వన్ జనరల్ మేనేజర్ శ్రీరామ్ ప్రసాద్, రావులపాలెం తహసీల్దార్ ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం



మృతి చెందిన నాగ సత్యవేణి

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులో స్కూటీపై వెళుతున్న మహిళను లారీ ఢీకొడంతో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం ఉండూరు గ్రామానికి చెందిన అంట నాగ సత్యవేణి (39) ఏఎన్ఎంగా పని చేస్తుంది. ఆమె స్కూటీపై వెళ్తుండగా ఓ లారీ ఓవర్ టేక్ చేసే క్రమంలో స్థానిక రాక్ సిరామిక్స్ వద్ద ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆమెను పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ సత్యవేణి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దాపురం పోలీసులు తెలిపారు.

నులి పురుగును నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని సంరక్షిద్దాం

- 20 నుంచి మలి విడత డీవార్మింగ్ డే
- అవగాహన సదస్సులకు చర్యలు



చింతలూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న ఆశ కార్యకర్త (ఫైల్)

ఆలమూరు: చిన్నారుల్లో రక్తహీనత, నిద్రలేమి, నీరసం, కడుపునొప్పి తదితర రుగ్మతలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో డీవార్మింగ్ డేను నిర్వహిస్తున్నాయి. చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు ఏడాదికి రెండు సార్లు క్రమం తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20, 27 తేదీల్లో డీవార్మింగ్ డే నిర్వహణకు జిల్లా వైద్యారోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని 22 మండలాల్లో 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,049 పాఠశాలలు ఉన్నాయి. డీవార్మింగ్ డేను పురస్కరించుకుని 2.94 లక్షల మంది పిల్లలకు, 3.24 లక్షల మాత్రలను అందించడమే లక్ష్యంగా జిల్లా వైద్యారోగ్య శాఖ మలి విడత ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిష్ణాతులైన 146 మంది వైద్యులతో పాటు 426 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 56 మంది ఫార్మాసిస్టులు, 587 మంది ఏఎన్ఎంలు, 1,395 మంది ఆశ కార్యకర్తలు సేవలు అందించనున్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన

జిల్లాలోని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బందికి నులిపురుగు నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. డీవార్మింగ్ డేలో మాతా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఈ మాత్రలను మింగించేటప్పుడు తీసుకునే జాగ్రత్తలపై ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మాత్రలు మింగించే సమయంలో ఏమాత్రం ఏమరపాటు ప్రదర్శించినా వాంతులు, విరేచనాలు, కడుపులో తిప్పడం వంటి దుష్పలితాలు సంభవించే అవకాశం ఉందని క్షేత్రస్థాయి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యార్థుల వయస్సును బట్టి మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మాత్రమే మింగించాలి. ఏడాది లోపు చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆల్బెండజోల్ మాత్రలు వేయరాదు. 1–2 ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలో సగం మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలి. 2–5 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రను పొడి చేసి పూర్తిగా నీటిలో కలిపి తాగించాలి. 6–19 ఏళ్ల లోపు విద్యార్థులతో మాత్రను మింగించాలి.

సంపూర్ణ ఆరోగ్యం



"పిల్లల వయసుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. మధ్యాహ్న భోజనం తరువాత చేతులను శుభ్రంగా కడుక్కుని మాత్రలను వేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి."

–ఎం.సుమలత, డివిజన్ అదనపు వైద్యాధికారి, కొత్తపేట

వాహనచోదకులకు జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో పలువురికి శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, త్రీ టౌన్, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ల పరిధుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 8 మందికి రెండు రోజుల జైలు, 10 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ పైకోర్టులో తీర్పు చెప్పారు. అలాగే కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.